క్లుప్తంగా

కొణిదేలలో ఆరోగ్య సురక్ష



సురక్షలో పాల్గొన్న వైద్యులు, అధికారులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు అనిల్ కుమార్, శ్వేత, మోహన్‌రావు గ్రామంలోని 435 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలిక చదువు భవిష్యత్తుకు వెలుగు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ

కొత్తపల్లి: బాలికల చదువు భవిష్యత్తుకు వెలుగు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని జీ.వీరాపురం ప్రాథమిక పాఠశాలలో బేటీబచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లను చదివిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. బాలికల చదువు కుటుంబానికి.. సమాజానికి వెలుగునిస్తుందని పేర్కొన్నారు. బాలికల ఆహారం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఖలీం బాషా, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, సురేఖ, ఆశావర్కర్లు రమాదేవి, ప్రవీణమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలను ఉపేక్షించం



అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న వీఆర్‌ఏలు

జూపాడుబంగ్లా: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలను ఉపేక్షించమని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాన్ని వీఆర్వో శ్రీరంగారెడ్డితో కలిసి తొలగించారు. కాగా తాను రెవెన్యూ, పంచాయతీ అధికారుల అనుమతి తీసుకుని జిరాక్స్ సెంటర్ కోసం గదిని నిర్మించుకుంటున్నానని.. ముందస్తు నోటీసు ఇవ్వకుండా కూల్చివేశారని సుశీల ఆవేదన వ్యక్తం చేసింది. తనకు రూ.50 వేల నష్టం వాటిల్లిందని వాపోయింది.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పాములపాడు: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నియమావళిని పాటించాలని.. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె పర్యటించారు. దుకాణదారులతో మాట్లాడారు. రాజకీయ పార్టీ నాయకులు దుకాణాలపై పోస్టర్లు అంటిస్తామంటే ఒప్పుకోవద్దని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనల గురించి వివరించారు. ఆమె వెంట హెడ్‌కానిస్టేబుల్ రామేశ్వర్, వీఆర్వో ముర్తుజా, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో మల్లికార్జునస్వామి వారి తిరునాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్, గ్రామ పెద్దలు ప్రారంభించారు. మొత్తం 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన యజమానులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సాలె కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు కొంగర అయ్యన్న, పర్వతాలు, నాగశేషులు, బోయ నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 64 మంది గైర్హాజరు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షల్లో భాగంగా నాల్గో రోజు శుక్రవారం గణితం పరీక్షకు 64 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వామి తెలిపారు. కొత్తపల్లి, గోకవరం పరీక్ష కేంద్రాల్లో 349 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 285 మంది హాజరయ్యారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు గౌరవం

- ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



టీడీపీలో చేరలేదని చెబుతున్న ఆర్యవైశ్య నాయకులు

మహానంది: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు గౌరవం దక్కిందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది మండల నాయకులతో శుక్రవారం నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం కార్యక్రమంలో నంద్యాలకు రానున్నారని, బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని, ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడాలన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని సూచించారు. కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు ప్రతి గడపకు తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలని తెలిపారు. అన్నదాతలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, సాయం, సాగునీటి అంశాలను రైతుల వరకు వెళ్లేలా చూడాలన్నారు. శ్రీశైలం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ సాధించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గెలుపు బహుమతిగా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మనస్పర్థలు ఉంటే పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం రెండు నెలల పాటు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, శరభారెడ్డి, మహేశ్వరరెడ్డి, కుంచపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ లెక్కలు టీడీపీకి అలవాటే

వెలుగోడు: పార్టీ చేరికలపై తెలుగుదేశం పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని.. ఆ పార్టీ నైజం అదేనని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ నెల 28న నంద్యాలలో నిర్వహించే మేము సిద్ధం బస్సు యాత్ర విజయవంతంపై ఆ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. ఓటమి భయంతో టీడీపీ నేతలు తప్పుడు ప్రచారానికి తెరలేపారన్నారు. 10 రోజుల క్రితం వైఎస్సార్‌సీపీలో 14 చేరికలు జరిగాయని.. ఇందులో మేం వాస్తవాలు చెప్పాం తప్ప తప్పుడు ప్రచారం చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నియోజకవర్గంలో సర్పంచ్, ఎంపీటీసీ, కౌన్సిలర్ల అభ్యర్థులను టీడీపీ తరఫున పోటీలో పెట్టి మధ్యలో చేతులెత్తేశారని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు చాలా మంది బుడ్డా తీరు నచ్చక స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరారని తెలిపారు. అలా చేరిన వారిలో కొందరు వాళ్లలో వారికే సరిపోక మళ్లీ టీడీపీ కండువాలు కప్పుకుంటున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీలో నిబద్ధత కలిగిన కార్యకర్తలు, అభిమానులు ఉన్నారని తెలిపారు. శ్రీశైలంలో ఆర్యవైశ్యులు నాగేశ్వరరావు బుడ్డా వర్గంలో ఉండేవారని, ఆ తర్వాత తన వెంట వచ్చారన్నారు. ఈ నెల 21వ తేదీ వెలుగోడు పట్టణంలో మాజీ ఎంపీటీసీ తెలుగు రమణ, వీరభద్రుడుతో కలిసి 24 కుటుంబాలు చేరితే 80 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు రాయించుకున్నారని ఎద్దేవా చేశారు. బుడ్డా రాజశేఖరరెడ్డి నోటికి వచ్చినట్లు వలంటీర్లను దూషిస్తున్నారని, ఈ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమకు నవరత్నాలే శ్రీరామ రక్ష అన్నారు. ఇటీవల టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మీటింగ్ పెట్టి ప్రధానిని పిలిపిస్తే లక్ష మంది కూడా హాజరుకాలేదని, మీటింగ్ నిర్వహించుకోలేక ప్రభుత్వంపై, పోలీసులపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. ఈ నెల 28న సీఎం వైఎస్ జగన్ మేము సిద్ధం కార్యక్రమం ద్వారా బస్సు యాత్రగా నంద్యాల జిల్లాకు వస్తున్నారని, ఈ యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ లాలం రమేష్, పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్ ఖాన్, దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ జయపాల్, రామ్మోహన్‌రెడ్డి, సయ్యద్ సులేమాన్, బళ్లాని వెంకట సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

మీటింగ్‌కు రమ్మని కండువాలు కప్పారు

మీటింగ్‌కు రమ్మని పిలిచి టీడీపీ కండువాలు కప్పారని పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవతో వైఎస్సార్‌సీపీ తరఫున తమ అన్న కుమారుడు లాలం రమేష్‌కు ఎంపీపీ పదవి వచ్చిందని, ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించారని లాలం రామకృష్ణయ్య, గూటూరు శ్రీనివాసులు, లాలం రమేష్(హోటల్), లాలం లక్ష్మీనారాయణ అన్నారు. తాము వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో శిల్పా చక్రపాణిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు.

ఫ్యాను గుర్తుకు ఓటేస్తే మరింత సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



ఎదురుపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్

కొత్తపల్లి: ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం ఎదురుపాడు, జడ్డువారిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ సచివాలయాల్లోనే అన్ని సేవలను అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ఏర్పాటు చేసి స్థానికంగానే ప్రజలకు సేవలందిస్తున్నామని తెలిపారు. వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు చేరుతున్నాయని చెప్పారు.

టీడీపీని నమ్మితే సర్వనాశనం

ఎలాగైనా అధికారంలోకి రావడానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలతో మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారని.. గత అనుభవాలను ప్రజలు మరిచిపోవద్దని సూచించారు. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించారని.. ఆయన్ను నమ్మి మోసపోవద్దన్నారు. టీడీపీకి ఓటు వేస్తే సంక్షేమం, అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఆ పార్టీని నమ్మితే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ పి.నాగలక్ష్మీరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ మహమ్మద్ గౌస్, సర్పంచ్ షేక్ నాజియా రహంతుల్లా, ఉప సర్పంచ్ నరసింహా,నాయకులు మహబూబ్ బాషా, అయ్యపురెడ్డి, స్వామిరెడ్డి, శిలార్ సాహెబ్, పి.వెంకటేశ్వర్లు, ఎం. వెంకటేశ్వర్లు, శివయ్య, చంద్రశేఖర్ ఆచారి, మౌలాలి, బీవీ రమణ, మహేష్, తేజ, మల్లేశ్వరయ్య, రమేష్ బాబు, నారాయణ రెడ్డి, మద్దిలేటి యాదవ్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ సేవ



మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతి, అలంకార నిర్వహించారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవం.. మల్లికార్జునస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని కొణదేల గ్రామంలో శుక్రవారం సాయంత్రం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంలో ఉత్సవమూర్తులను ఉంచి గ్రామంలోని పుర వీధుల మీదుగా ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధారా సుధీర్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి స్వామిఅమ్మవార్లకు పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ విజయభాస్కర్, ప్రకాశ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సురేష్, సర్పంచ్ నవీన్ కుమార్, ఆలయ ధర్మకర్త సాలె కిరణ్‌కుమార్, ఈఓ కార్తీక్, కమిటీ సభ్యులు పుల్లయ్య, వేణుగోపాల్, విజయలక్ష్మి, నాగలక్ష్మయ్య, నాగేశ్వరమ్మ, లలితమ్మ, పబ్బతి రవి, సుధాకర్‌రెడ్డి, ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి కలకలం

- జాడకోసం అటవీ అధికారుల అన్వేషణ



ఎలుగుబంటి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు పంచాయతీ జడ్డువారిపల్లె గ్రామ శివారులో శుక్రవారం ఎలుగుబంటి కలకలం రేపింది. గ్రామానికి చెందిన గంగాధర్, మహేంద్ర, చిన్న మల్లేశ్వరయ్య, మద్దిలేటి ఉదయాన్నే బహిర్భూమికి గ్రామ శివారులోని పంటపొలాల్లోకి వెళ్లారు. అదే సమయంలో నీటిమునక ప్రాంతం నుంచి ఓ ఎలుగుబంటి గ్రామం వైపు రావడాన్ని గమనించారు. కేకలు వేయడంతో కుక్కలు వెంట పడ్డాయి. దీంతో ఎలుగుబంటి నీటిమునక భూములవైపు పరుగెత్తింది. గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు, ఎఫ్‌బీఓ పాములేటి, ఆత్మకూరు డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పాదముద్రను గుర్తించారు. ఎలుగుబంటి జాడకోసం అన్వేషిస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీశైలం ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 25వ తేదీ వరకు సున్నిపెంటలోని పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ఉచితంగా మెటీరియల్ ఇస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 27వ తేదీ పాలిసెట్ జరుగుతుందని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ అన్నారు. బుక్కాపురం గ్రామానికి చెందిన నర్సయ్య మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించారు. నిందితుడి వద్ద నుంచి 35 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించేవారిపై సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

శ్రీశైలంలో నేడు కామదహనం

శ్రీశైలంటెంపుల్: పాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం కామదహనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆలయం ముందుభాగంలోని గంగాధర మండపం వద్ద స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం సంప్రదాయాన్ని అనుసరించి గడ్డితో చేసిన మన్మథ రూపాన్ని దహనం చేస్తారు. మన్మథుడు శివతపోభంగం చేయగా కోపించిన పరమేశ్వరుడు మన్మథుడిని పాల్గుణ శుద్ధ చతుర్దశి రోజే దహించాడని పురాణాలు చెబుతున్నాయి. కామదహన కార్యక్రమాన్ని వీక్షించడం వల్ల శివకటాక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ముందస్తుగా గుర్తిస్తే క్షయవ్యాధికి చెక్

ఆత్మకూరు: ముందస్తుగా గుర్తిస్తే మందుల ద్వారా క్షయవ్యాధిని నివారించవచ్చని బైర్లూటీ వైద్యాధికారి పవన్ కుమార్ అన్నారు. చెంచుగూడెంలో శుక్రవారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. దగ్గు, గళ్లపడడం, జ్వరం, బరువుతగ్గడం వంటి లక్షణాలు ఉంటే సమీపంలోని వైద్యశాలకు వెళ్లి గళ్ల పరీక్షలతో వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. మందుల ద్వారా నివారించవచ్చని అన్నారు. మందులతో పాటు పోషకాహారం తీసుకోవడం వల్ల పూర్తిగా నయం అవుతుందన్నారు.

వినసొంపుగా భక్తిగీతాలాపన



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ప్యాపిలికి చెందిన సీతారామాంజనేయ భజన మండలి భక్తి గీతాలతో భక్తులను కట్టిపడేశారు. శివ శివశంకరా, నమఃపార్వతి, శివ శివ అనరాదా, శివ నామమే, శంభోమహేశ, పలు భక్తిగీతాలు, అష్టకాలు మొదైన వాటిని ఆదినారాయణ, రంగస్వామి, మహేష్, రామచంద్రుడు, గోవిందు, రాజు, పెద్ద వెంకటరెడ్డి, పురుషోత్తమరెడ్డి, మద్దయ్య, మద్దిలేటి, శేషు తదితరులు ఆలపించారు.

నీటి వనరుల రక్షణ అందరి బాధ్యత



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ

మహానంది: నీటి వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మనం పొదుపు చేసి కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అందించినవారమవుతామని మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి.జయలక్ష్మి అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ నీటి దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ప్రాంతాల్లో తాగు, సాగునీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న తీరును విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ సరోజినీదేవి, స్వరాజ్యలక్ష్మి, ఎల్.విజయభాస్కర్, గీతా శిరీష, వెంకటేశ్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలి

పాములపాడు: వర్షాకాలంలో భూమిపై పడే ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలని ఏపీఓ విమలమ్మ అన్నారు. నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని తుమ్మలూరు, జూటూరు, వేంపెంట గ్రామాల్లో ఉపాధి కూలీలతో సమావేశాలు నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఫారంపాండ్స్, చెక్‌డ్యాం, చెక్ వాల్, తదితర పనులు చేపట్టి నీటిని నిల్వ చేసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు నీటి విలువను తెలియజేయాలన్నారు.

ప్రతి గిరిజనుడికి ఆధార్ ఉండేలా చర్యలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచుగిరిజన గూడేలలో ఆధార్ క్యాంపులు నిర్వహించి ప్రతి గిరిజనుడికి ఆధార్ కార్డ్ ఉండేలా ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ పనిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రవీంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కొందరు గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆధార్ నమోదు చేయించాలన్నారు.

ఆయుర్వేదంతో మంచి ఫలితాలు



మందులను పంపిణీ చేస్తున్న నాగరాజు

మహానంది: సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద మందులతో పూర్తిగా నయం చేసుకోవచ్చని బండిఆత్మకూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యుడు వి.నాగరాజు అన్నారు. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులకు రక్తం పెరుగుదలకు, ఆరోగ్యానికి అవసరమైన చవన్‌ప్రాశ్ మందులను పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యశాలలో ప్రజలు వైద్యసేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సుభద్రమ్మ, చరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డి కుంటలో అక్రమ తవ్వకాలు



ట్రాక్టర్లలో తరలిస్తున్న మట్టి

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలోని బుచ్చిరెడ్డికుంటలో వారం నుంచి అక్రమ తవ్వకాలు చేస్తూ యథేచ్ఛగా మట్టిని విక్రయించుకుంటున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారు. అక్రమార్కులు జేసీబీ, ప్రొక్లెయిన్ల సహాయంతో కుంటలోని మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నారు. రూ.800ల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పారుమంచాల గ్రామ ప్రజలు కోరుతున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



రుద్రవరంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

పాములపాడు: ప్రతి పౌరుడు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రవరం, జూటూరు, క్రిష్ణారావుపేట, తుమ్మలూరు గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com